ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల

జిల్లా వార్తలు

5★★

సోమవారం 28 ఏప్రిల్ 2025

ప్రశాంతంగా ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

వెల్గటూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరిపల్లి మాడల్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ఆదర్శ పాఠశాలప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నిర్వహించిన 6వతరగతి పరీక్షకు 149 మంది విద్యార్థులకు గాను 133 మంది హాజరు అయినట్లు ప్రిన్సిపాల్, చీఫ్ సూపరింటెండెంట్ కృష్ణప్రసాద్ తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన 7,8,9, 10వతరగతి పరీక్షకు 97 మందికి గాను 84 మంది హాజరు అయినట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాన్ని ఎంఈవో ప్రభాకర్ పరిశీలించారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఏఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ డైరెక్టర్

కనకదుర్గకు ఘన నివాళి



ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ డైరెక్టర్ వేమూరి కనకదుర్గ నాలుగో వర్ధంతి సందర్భంగా ఆదివారం కరీంనగర్ యూనిట్ కార్యాలయంలో బ్రాంచి మేనేజర్ కళ్లెపు సంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న సిబ్బంది

నీటి బొట్టు.. ఒడిసి పట్టు



- ఇంకుడుగుంతలు తవ్వేందుకు అనువైన సమయం
- అవగాహన లోపంతో ముందుకు రాని ప్రజలు
- మున్సిపాలిటీల్లో నెరవేరని లక్ష్యం
- ప్రజలకు అవగాహన కల్పించాలని నిపుణుల సూచన

జగిత్యాల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఇంకుడు గుంతలను నిర్మించి ప్రతి నీటి బొట్టును ఒడిసి పడితేనే వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చేయవచ్చు. భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు, వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు ఇంటింటా ఇంకుడు గుంతలు తవ్వించాలని ప్రభుత్వం గతంలోనే ఆదేశాలు జారీ చేసింది.

ఈ క్రమంలోనే మున్సిపాలిటీల్లోనూ, ఇతర సామాజిక స్థలాల్లోనూ వీటిని తవ్వించాలని సూచించింది. ఐదేళ్ల కిందట పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసింది. కానీ అప్పటి నుంచి నేటి వరకు పనుల జాడే లేకుండా పోయింది. వర్షపు నీరంతా మురుగు కాల్వల్లో వృథాగా పోతోంది. ఇళ్లలోనూ ఇంకుడుగుంతల నిర్మాణానికి ప్రజలకు సరైన అవగాహన కల్పించకపోవడంతో చాలా మంది ముందు కు రావడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వ కార్యాలయాల్లో, ఇళ్లలో నిర్మించిన వాటిని బాగు చేయడంతో పాటు కొత్తవాటిని నిర్మిస్తే ప్రతి నీటి బొట్టును వృథా కాకుండా అరికట్టే అవకాశాలున్నాయి.

● స్థలమున్నా స్పందన కరువు..

జిల్లాలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో విశాలమైన స్థలం ఉంది. ఆయా ప్రాంతాల్లో వీటిని తవ్విస్తే ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అవకాశం కలుగుతుంది. మూడేళ్ల కిందట సర్కారు మున్సిపాలిటీల వారీగా లక్ష్యాలను విధించింది. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి మున్సిపాలిటీల్లో సుమారు 3వేల ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలని ఉన్న తాధికారులు గతంలో సూచించారు. ఒక్కో యూనిట్‌కు సుమారు రూ.6 వేల నుంచి రూ.8 వేల దాకా ఖర్చవుతుందని అంచనా వేశారు. ప్రధానంగా ప్రభుత్వస్థలాలు, బస్టాండ్లు, వ్యవసాయ మార్కెట్లు, పాఠశాలలు, కళాశాలలు, పార్కులు, నీటి ట్యాంకులు ఇతర ప్రభుత్వ స్థలాల్లో వీటిని ఏర్పాటు చేయాల్సి ఉంది. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలకు లక్ష్యం విధించినా, కనీసం పదిశాతం కూడా కార్యరూపం దాల్చలేదు. పలు మున్సిపల్ కార్యాలయాలతో పాటు, ఎంపీడీవో, పోలీసు స్టేషన్, రెవెన్యూ కార్యాలయాల ఆవరణలో నిర్మించిన ఇంకుడుగుంతలు ఆనవాళ్లు లేకుండా పోతున్నాయి. జిల్లా కేంద్రంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

● నీటి ఎద్దడితో సతమతం..

ఎండలతో భూగర్భ జలాలు మరింత లోతుకు పడి పోయాయి. గతంలో తవ్విన వాటిని సత్వరం బాగు చేసి వినియోగంలోకి తీసుకవస్తేనే నీటి వృద్ధికి మార్గం సుగమం అవుతుంది. ఆయా మున్సిపాలిటీల్లోని పలు వార్డుల్లో నీటి ఎద్దడి చాయలు కనిపిస్తున్నాయి. పలు కాలనీల్లో ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. ఆరు వందల నుంచి ఎనిమిది వందల అడుగుల లోతు బోర్లు తవ్వినా చుక్క నీరు రావడం లేదు. దీంతో యజమానులు ఆర్థికంగా నష్టపోతున్నారు. గృహాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంతలు తవ్వేందుకు ఇదే సరైన సమయమని సంబంధిత అధికార వర్గాలు అంటున్నాయి. ప్రస్తుతం ఇంకుడుగుంతలు ఏర్పాటు చేస్తే ..

మిగతా 8లో

ప్రధాని 'మన్‌కీబాత్'ను వీక్షించిన బీజేపీ శ్రేణులు

కథలాపూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్రమోదీ మన్‌కీబాత్ సందేశాన్ని ఆదివారం మండలంలోని సిరికొండలో బీజేపీ శ్రేణులు వీక్షించారు. ప్రధాని మోదీ స్వయంగా ప్రజలతో మమేకం కావడం ఓ చరిత్ర అని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి పర్యవేక్షకులుగా ఎస్సీమోర్చా జిల్లా అధ్యక్షుడు నంటి మహేశ్ వ్యవహరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మల్యాల మారుతి, మాజీ అధ్యక్షుడు రాచమడుగు వెంకటేశ్వర్ రావు, శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు మంగళి మహేశ్, గూడురు గణేశ్, కాశోజి ప్రతాప్ తదితరులు ఉన్నారు.

●మల్యాల: మండలంలోని తాటిపల్లిలో ఆదివారం పార్టీ ఆదేశాల మేరకు మండల బీజేపీ నాయకులు ప్రధాని నరేంద్రమోదీ మన్ కీ బాత్ కార్యక్రమం వీక్షించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ ప్రధాన మంత్రి సందేశంను ప్రజల్లోకి తీసుకెళతామని అన్నారు. సంచార్ సంయోగి రాంకిషన్, నాయకులు బింగి వేణు, గాజుల మల్లేశం, రాచర్ల రాములు, పిల్లి రాజశేఖర్, మల్లేశం ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అపూర్వ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కోరుట్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివిన 1974-1975 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పట్టణంలోని పోతని భూమయ్య కల్యాణ భవనంలో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఆరు పదుల వయస్సులో అపూర్వ సమ్మేళనంగా ఏర్పడిన పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి సినిమా పాటలతో వారు నృత్యాలు చేయడంతో కళ్యాణ భవనంలో సందడిగా మారింది. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చౌల పరందాం, దనంజయ్, బూర్గు రామస్వామి గౌడ్, కంటి బుచ్చిరాజం, తునికి సత్యనారాయణ, ఉషికోల భూమేశ్వర్, మానుక ప్రవీణ్ కుమార్, పిన్నంశెట్టి అనంద్, ప్రకాష్ పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

● అడిషనల్ కలెక్టర్ బీ.ఎస్ లత



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత

కొడిమ్యాల, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత అన్నారు. ఆదివారం మండలంలోని నాచుపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ధాన్యం కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ పరిశీలించారు. కేంద్రానికి రైతులు తీసుకు వచ్చిన ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే తూకం వేయాలన్నారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. హమాలీల కొరత ఉన్నందున రైతులు సహకరించుకోవాలన్నారు. అడిషనల్ కలెక్టర్ వెంట డీసీఎస్‌వో జితెందర్, తహసీల్దార్ జి.రమేష్, డిప్యూటీ తహసీల్దార్ ఆనంద్‌కుమార్, ఫుడ్ ఇన్స్‌పెక్టర్ నర్సింహస్వామి, అర్‌ఐ కరుణాకర్, కొడిమ్యాల సింగిల్ విండో కార్యదర్శి గంగాధర్ సిబ్బంది ఉన్నారు.

'సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి'



మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

జగిత్యాల అర్బన్, ఏప్రిల్27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మే 20న చేపట్టిన దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన సదస్సులో కేంద్ర రాష్ట్ర కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. దేశవ్యాప్త సమ్మె సన్నాహక సమావేశం జగిత్యాల జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కేంద్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు కృష్ణ సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు వీఎస్ రావు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్యలు మాట్లా డుతూ కేంద్రంలో బీజేపీ మూడవసారి అధికారంలోకి వచ్చినా కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు. కార్పొరేట్ అనుకూల, మతోన్మాద చర్యలను మరింత దూకుడుగా అమలు చేస్తున్నదని అన్నారు.

కార్మిక వర్గం సమరశీల పోరాటాల ద్వారా వంద సంవత్సరాలలో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను ముందుకు తెచ్చిందని విమర్శించారు. వీటికి వ్యతిరేకంగా కార్మిక వర్గం చేస్తున్న పోరాటాలతో లేబర్ కోడ్‌ల అమలు ఆలస్యమయినా ఇప్పుడు వాటిని అమలు చేసి కార్మిక హక్కులను పూర్తిగా హరించే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. బడ్జెట్‌లోనూ సామాజిక సంక్షేమానికి కోతలు పెట్టిందని విమర్శించారు. జిల్లా కార్మిక వర్గం సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. రాజ్యాంగం అమలులోకి వచ్చిన 78 సంవత్సరాల తర్వాత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు ముప్పు వాటిల్లిందని, కార్పొరేట్ల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు పుప్పాల శ్రీకాంత్ సూతారి రాములు, చింత భూమేశ్వర్, టి. సమ్మయ్య, మహ్మద్ ముజీబ్, రాంప్రసాద్, ఎండి ఖాజా, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీ చరిత్రాత్మకం

మెట్‌పల్లిటౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సన్న బియ్యం పంపిణీ చేయడం చరిత్రా త్మక నిర్ణయమని మెట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ అన్నారు. ఆదివారం పట్టణంలోని అతియా బేగం కుటుంబ సభ్యుల ఇంట్లో కాంగ్రెస్ నాయ కులతో కలిసి ఆయన సహపంక్తి భోజనం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ సన్నబియ్యం పథకం పేద ప్రజల కడుపు నింపుతుందన్నారు. రాష్ట్రంలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న నిరు పేద లందరికి పూర్తిస్థాయిలో ఆహార భద్రత కల్పించేందుకే సన్నబియ్యం పంపిణీ కార్య క్రమం చేపట్టామన్నారు. పథకం పక్కాగా అమలు పర్చేందుకు రేషన్‌షాపుల ద్వారా పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మెట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షులు ఖుతుబ్ పాషా. రాష్ట్ర సేవాదళ్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ అందే మారుతి బాపుజీ, కోరే రాజకుమార్, మొహమ్మద్ రహీముద్దీన్, మహమ్మద్ అనాస్, మహ మ్మద్ మదర్ పాల్గొన్నారు.

ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు



బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్సీ రమణ, నాయకులు

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): భారత రాష్ట్ర సమితి 25వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం జగిత్యాల పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఎమ్మెల్సీ ఎల్.రమణ క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీఆర్ఎస్ శ్రేణులు రజతోత్సవ వేడుకలకు తరలారని అన్నారు. అనంతరం కార్యకర్తలకు, నాయకులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు గట్టు సతీష్, బీఆర్ఎస్ నాయకులు వొల్లాల గంగాధర్, సమిండ్ల శ్రీనివాస్, సాగర్ రావు, వొల్లెం మల్లేశం, కోరుకంటి రాము, ఎల్.కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

● జగిత్యాల పట్టణంలోని రెండవ వార్డులో జరిగిన బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకల్లో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దావ వసంత పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు.

అనంతరం ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ 25 సంవత్సరాల వేడుకలకు కేసీఆర్ సభకు జిల్లా నుంచి వేలాదిగా కార్యకర్తలు తరలి వెళ్లారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మనోజ్, సత్యం, మల్లారెడ్డి, రాజేందర్, మధుకర్, భగవాన్, అబి, అనిల్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

● ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు



పోస్టర్ విడుదల చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కార్మిక దినోత్సవం మే డేను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు పిలుపునిచ్చారు. జగిత్యాల జిల్లా క్రేంద్రంలో ఆదివారం మే డే పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పోరాట దినముగా జరపాలన్నారు. ఎనిమిది గంటల పని దినం కోసం పోరాడి హక్కులు సాధించుకున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎండి ముక్రం, మునుగూరి హనుమంతు, ఇరుగురాల భూమేశ్వర్, రామిల్ల రాంబాబు, రాచర్ సురేష్, వెన్న మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. తడిసిన ధాన్యం

● అన్నదాతకు నష్టం



మెట్‌పల్లి మార్కెట్‌యార్డులో తడిసిన ధాన్యం

ప్రతి ఆదివారం..అంబేడ్కర్ స్మరణ అభినందనీయం

- పోతారం పీఏసీఎస్ చైర్మన్ అయిల్నేని సాగర్‌రావు



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

జగిత్యాల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రతిఆదివారం అంబేడ్కర్ స్మరణ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం అని పోతారం పీఏసీఎస్ చైర్మన్ అయిల్నేని సాగర్‌రావు అన్నారు. పట్టణంలోని ప్రబుద్ధ ఫౌండేషన్ నిర్వాహకులు నల్లశ్యామ్ ఆధ్వర్యంలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. బాబా సాహెబ్ అందరి వారని గమనించాలన్నారు. వారి ఆశయాలను,ఆదర్శ భావాలను భావి తరాలకు స్ఫూర్తి పొందేలా స్మరించుకోవడమే లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమం నిర్వహిస్తున్న నిర్వాకులకు ఆయన అబినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాల బాధ్యులు నల్లశ్యామ్, నక్క విజయ్, బండ శంకర్, చిత్తారి ప్రభాకర్, కోరుకంటి రాము, రవి, గంగాధర్, మద్దెల నారాయణ, బొల్లె రాజన్న, అంజన్న, లక్కం ప్రసాద్, దుమాల గంగాధర్ తదితరులున్నారు

అండగా మేముంటాం..

- నిరుపేదలు, అనాథ పిల్లలకు ఆపన్న హస్తం
- సామాజిక సేవలో ముందుంటున్న యువకులు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ఇల్లంతకుంట మండలంలోని నిరుపేదలు, అనాథ చిన్నారులకు ఆర్థిక సహాయంతోపాటు ఇతర సేవలు అందిస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నారు ఆ యువకులు. మండలంలోని నర్సక్క పేటకు చెందిన బెంద్రం తిరుపతిరెడ్డి పది సంవత్సరాలుగా బీటీఆర్ ఫౌండేషన్‌ను స్థాపించి నిరుపేద యువతుల వివాహ సమయంలో టేకు మంచాలు అందిస్తున్నాడు. గ్రామాల్లో జరిగే ఉత్సవాలకు, యువకులను క్రీడల్లో ప్రోత్సహించడానికి తనవంతు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నాడు. అలాగే గాలిపెల్లి గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు హరికృష్ణారెడ్డి పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నాడు. అలాగే పెద్దలింగాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ జితేందర్‌గౌడ్ అనాథ పిల్లలకు పండుగ సమయాల్లో కొత్త దుస్తులు కొనిస్తుంటున్నాడు. రోడ్డు ప్రమాదాల నివారణకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యపరుస్తున్నాడు.



నిరుపేద యువతి వివాహానికి టేకు మంచాలు అందిస్తున్న తిరుపతిరెడ్డి



అనాథ పిల్లలకు ఆర్థిక సహాయం చేస్తున్న మాజీ సర్పంచ్ జితేందర్‌గౌడ్

500మంది వివాహాలకు చేయూత..

- బెంద్రం తిరుపతిరెడ్డి, నర్సక్కపేట



మండలంలోని నిరుపేద యువతుల వివాహాలు ఎక్కడ జరిగినా రూ.10వేల విలువైన టేకు మంచాలు అందిస్తాను. ఇప్పటివరకు 500మంది యువతుల వివాహాలకు చేయూతనందించా. ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం, మజ్జిగ కేంద్రాలు ఏర్పాటు చేశా.

ఆపదలో ఉన్నవారికి అండగా..

- అయ్యన్నగారి హరికృష్ణారెడ్డి, గాలిపెల్లి



ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం కనీస బాధ్యత. గాలిపెల్లి సర్పంచ్‌గా మానాన్న చేసిన సేవలను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగుతున్నాను. గుంతలు పడిని రోడ్డును బాగుచేయడం, ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రోత్సహించడం వల్ల భవిష్యత్తులో మరింత రాణించగలుగుతారు.

సహాయం చేయడంతో తృప్తి కలుగుతుంది..

- గొడిశెల జితేందర్‌గౌడ్, పెద్దలింగాపూర్



ఆపత్కాలంలో సహాయం చేయడంతో తృప్తి కలుగుతుంది. ప్రతి సంవత్సరం అనాథ పిల్లలకు పండుగపూట దుస్తులు కొనక్కోవడానికి సహాయం చేస్తాను. నిరుపేద కళాకారులు ఇబ్బంది పడుతుంటే వారికి అండగా నిలువడం జరుగుతుంది. నిరుపేదకు ఇల్లు కట్టివ్వడం ఎప్పటికి మర్చిపోలేను.

డంపింగ్ యార్డును తొలగించాలి



డంపింగ్ యార్డ్‌ను తొలగించాలని నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

భగత్‌నగర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): నగరపాలకసంస్థ డంపింగ్ యార్డునుతొలగించాలని కోతిరాంపూర్‌లోని శ్రీవరసిద్ధి వినాయకకాలనీ వాసులు ఆదివారం నిరసన తెలిపారు. అనంతరం కాలనీనుంచి కోతిరాంపూర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డంప్ యార్డు తొలగింపు, సమస్యల పరిష్కారం కోసం పార్టీలకతీతంగా నిరసన తెలిపామన్నారు. కోతిరాంపూర్ ప్రజల భవిష్యత్ దృష్ట్యా డంపింగ్ యార్డును శాశ్వతంగా తొలగించాలన్నారు. కాలనీ అధ్యక్షుడు నాగిరెడ్డి గణేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బొద్దుల జగదీష్, ప్రధాన కార్యదర్శి బండిపల్లి పర్శరాములు, రామన్న, ఇజ్జగిరి శ్రీనివాస్, గంటామోహన్‌రెడ్డి, హరిమోహన్, మాజీ కార్పొరేటర్ లెక్కల వేణు, తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

రుద్రంగి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఓఇంట్లోచోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగికి చెందిన ఎల్లాదేవా అనే మహిళ నాలుగు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లింది. ఆదివారం సాయంత్రం ఇంటికి వచ్చేసరికి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోఉన్న యాభైవేలువిలువచేసే బంగారం, ఐదువేల నగదును దొంగలు ఎత్తుకెళ్లారు. సమాచారంతెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీమ్‌తోచేరుకొని వేలిముద్రలు సేకరించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సిరిసిల్ల అశోక్ తెలిపారు.

తాండ్ర్యాల గ్రామంలో చోరీ

కథలాపూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాండ్ర్యాలలో ఆదివారం తెల్లవారుజామున గ్రామశివారులోనిఎల్లమ్మ, దుర్గమ్మ ఆలయాల్లో గుర్తు తెలియని వ్యక్తులు హుండీలను ధ్వంసంచేసి నగదు, బంగారం ఎత్తుకెళ్లారు. అక్కడే ఉన్న కిరాణాకొట్టు, హోటల్ తాళాలు పగులగొట్టి అందులో ఉన్న సిలిండర్‌తో పాటు వివిధ రకాల సరుకులను ఎత్తుకెళ్లారు. కాగా పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు.

నాగంపేటలో దొంగల బీభత్సం

- పదిళ్లలో చోరీ



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

గంబీరావుపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గంబీరావుపేట మండలం నాగంపేట గ్రామంలో శనివారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్‌చేస్తూ దొంగతనానికి పాల్పడ్డారు. పది ఇళ్లలో తాళాలు పగులగొట్టి దొంగలు చోరీకి పాల్పడ్డారు. గురుక లక్ష్మి ఇంట్లో ఒక ల్యాప్‌టాప్, తులం బంగారం చైన్, రూ.10వేల నగదు, కోల్తూరు అంజయ్య ఇంట్లో పావుతులం బంగారం మాటీలు, 18తులాల వెండి పట్టగొలుసులు, 8 వేల నగదు, చేప్యాల శేఖర్ ఇంట్లో తులం బంగారు బ్రాస్‌లెట్, అరతులం వెండి బ్రాస్‌లెట్, చేప్యాల రాజవ్వ ఇంట్లో 10వేల నగదు, చేప్యాల శంకర్ ఇంట్లో 20తులాల వెండి పట్టగొలుసులు, కోల్తూరిచందు ఇంట్లో పావుతులం బంగారం చైను, తులం బంగారు గుండ్లు, 30 తులాల వెండిపట్టగొలుసులు, మంగోలి రమేష్ 3 గ్రాముల బంగారం మాటీలు, 1500 నగదు ఎత్తుకెళ్లారు. మరో మూడిండ్లలో దొంగతనానికి యత్నించినా ఏమీదొరకలేదు. బాధితులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్‌ఐ ప్రేమానందం, డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంతో పరిశీలించి ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ ప్రేమానందం తెలిపారు.

తాటి చెట్టు పై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

బీర్‌పూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన పులి మురళిగౌడ్ అనే గీత కార్మికుడు ఆదివారం తాటి చెట్టుపై నుంచి పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన తోటి గీత కార్మికులు చికిత్స నిమిత్తం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

హుజూరాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి):హుజూరాబాద్ పట్టణంలో జరిగిన రోడ్డుప్రమాదంలో ఓ వ్యక్తి గాయాల పాలయ్యాడు. పట్టణంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో ఆదివారం రాత్రి ఎల్కతుర్తి బీఆర్‌ఎస్ రజతోత్సవసభకు వెళ్లి వస్తుండగా గోదావరిఖనికి చెందిన ఓదెలును కారు ఢీకొట్టింది. దీంతో ఓదెలుకు గాయాలుకావడంతో హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

- మృతుల్లో ఒకరు ఇంటర్ విద్యార్థి



మహేశ్‌బాబు(ఫైల్)



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా సంతనూతలపాడు మండలం మైనంపాడు గ్రామానికి చెందిన ఇంటర్‌విద్యార్థి తన్నీరుమహేశ్‌బాబు (16), సంటరుపాడు గ్రామానికి చెందిన దినసరి కూలీ కుంచెర్ల మధు(34) అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. ప్రమాదంలో ఇద్దరు మృతిచెందడంతో వలస కుటుంబాల్లో విషాదం నెలకొంది. పోలీసులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశంజిల్లా సంతనూతలపాడు మండలం మైనంపాడు గ్రామానికి చెందిన తన్నీరు కుమారి-శివ దంపతులు తమ ఇద్దరు కొడుకులు శ్రీనివాస్, మహేశ్‌బాబులతో కలిసి కొన్నేళ్లక్రితం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి వలస వచ్చి భవన నిర్మాణ పనులు చేసేవారు. మూడేళ్ల క్రితం హైదరాబాద్‌కు వెళ్లి అక్కడేపనులు చేస్తూ జీవిస్తున్నారు. చిన్నకొడుకు మహేశ్‌బాబు ఆంధ్రప్రదేశ్‌లోని పొదిలిలో సంక్షేమ వసతిగృహంలో ఉంటూ ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల పరీక్షలు ముగియడంతో అతనికి పరిచయం ఉన్న మధుతో కలిసి పదిరోజుల కిందట ఎల్లారెడ్డిపేటలోని బంధువుల ఇంటికి వచ్చారు. ఇద్దరు కలిసి ద్విచక్రవాహనంపై సిరిసిల్లవైపువెళుతున్న క్రమంలో ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో రెండు వాహనాలు నుజ్జునుజ్జు కాగా, మృతదేహాలు చెల్లచెదురుగా పడ్డాయి. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



కృష్ణారెడ్డి(ఫైల్)

తిమ్మాపూర్, ఏప్రిల్ 27, (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్ అలుగునూర్‌కి చెందిన బొల్లాడి కృష్ణారెడ్డి(48) కరీంనగర్‌లోని చింతకుంట వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, అలుగునూర్‌కి చెందిన బొల్లాడి కృష్ణారెడ్డి ఆదివారం తెలిసిన వారి ఇంట్లో ఒకరు మృతిచెందగా వారి కుటుంబాన్ని పరామర్శించేందుకు తన ద్విచక్రవాహనంపై వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో చింతకుంట వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో బొల్లాడి కృష్ణారెడ్డి మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

వడదెబ్బతో ఇద్దరి మృతి



చొప్పదండిలో మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి



లక్ష్మి(ఫైల్)

చొప్పదండి/ధర్మారం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలో వడదెబ్బతో ఆదివారం ఇద్దరు మృతి చెందారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి పట్టణంలోని జ్యోతినగర్ వేబ్రిడ్జి వద్ద శనివారం గుర్తుతెలియని వ్యక్తి వడదెబ్బ తగిలి స్పృహతప్పి పడిపోయాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా వారు వచ్చి 108లో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం అతడు మరణించాడు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన చెక్కపల్లి లక్ష్మి (56) వడదెబ్బతో మృతి చెందింది. తీవ్రమైన ఎండలతో మూడు రోజుల క్రితం లక్ష్మి ఇంటి వద్ద అస్వస్థతకు గురైంది. స్థానికంగా చికిత్స చేయించినా ఆరోగ్యం కుదుటపడలేదు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది.

హార్వెస్టర్ దగ్ధం

భీమారం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): భీమారం మండల కేంద్రంలో వరి పంట కోస్తుండగా షార్ట్ సర్క్యూట్‌తో హార్వెస్టర్ దగ్ధమైంది. మన్నెగూడెం గ్రామానికి చెందిన గంగాధర్‌కు చెందిన హార్వెస్టర్ నిప్పంటుకుని కాలిపోయింది. స్థానిక రైతులు గమనించి మంటలను ఆర్పారు.



దగ్ధమవుతున్న హార్వెస్టర్

యువకుడి ఆత్మహత్య ఘటనపై డీఎస్పీ విచారణ

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామంలోని యువకుడు గడ్డి నరేందర్ (24) ఈనెల 21న మండల కేంద్రంలోని ఓ మహిళ ఇంటి సమీపంలో ఒంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం రెండు గ్రామాల్లో విచారణ చేపట్టారు. రాచర్లబొప్పాపూర్‌లోని మృతుడి ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యులను ఆత్మహత్యకు కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని ఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎస్‌ఐ రమాకాంత్ ఉన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి మృతి

రాయికల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలం మైతాపూర్ రోడ్డులో ఆసిఫాబాద్ జిల్లా తిర్యాని మండలానికి చెందిన బొజ్జిరావు(45) అనేవ్యక్తి అతిగా మద్యం తాగి ఆదివారం మృతిచెందినట్లు రాయికల్ పోలీసులు తెలిపారు. రెండు నెలల క్రితం రాయికల్ వచ్చి కూలి పనిచేస్తున్న బొజ్జిరావు వచ్చిన డబ్బులతో మద్యం తాగేవాడని పోలీసులు తెలిపారు. ఆదివారం మైతాపూర్ రోడ్డులో బొజ్జిరావు మృతదేహం కనిపించగా శవాన్ని మార్చురీకి తరలించి విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశామని పోలీసులు పేర్కొన్నారు.

హమాలీల కొరతతో నిలిచిన ధాన్యం కొనుగోళ్లు



కోరుట్ల మార్కెట్ కమిటీలో నిలువ ఉన్న ధాన్యం

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల పట్టణంలోని మార్కెట్ కమిటీలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించినప్పటికీ హమాలీల కొరతతో నాలుగు రోజులుగా ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి. కొద్ది రోజుల క్రితం సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని నాయకులు అధికారులతో అట్టహాసంగా ప్రారంభించారు. వాతవరణమార్పులతో రైతులు ఇబ్బందులు పడుతున్నప్పటికీ అధికారులు హమాలీలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్‌లో అందుబాటులో ఉన్నకవర్లను వేసుకొని రైతులు ప్రతిరోజు కొనుగోలు కేంద్రం వద్ద నిరీక్షిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు హమాలీలను ఏర్పాటుచేసి కొనుగోళ్ల వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై సింగిల్‌విండో అధికారిని వివరణకోరగా బీహార్‌రాష్ట్రానికి చెందిన హమాలీలను మాట్లాడి అడ్వాన్‌కూడా ఇచామని వారు ఇప్పటివరకు రాకపోవడంతోకొంత ఇబ్బందుతు తలెత్తుతున్నాయన్నారు. త్వరగా హమాలీలను ఏర్పాటు చేసి కొనుగోళ్ల పూర్తి చేసి రైతుల ఇబ్బందులు తొలగిస్తామని పేర్కొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

పెగడపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండలంలోని నార్సింహానిపేట గ్రామంలో శనివారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన ఆరెల్లిదుర్గయ్య ఇంట్లో అర్ధరాత్రి విద్యుత్‌షార్ట్‌సర్క్యూట్‌తో ఒక్క సారిగా మంటలు అంటుకుని ఇంట్లోని ఫర్నిచర్, బట్టలు, నిత్యావసర సరుకులతో పాటు రూ.40 వేల నగదు దగ్ధం అయినట్లు బాధితుడు తెలిపాడు. ఘటనా స్థలాన్ని గిర్దావర్ శ్రీనివాస్ పరిశీలించారు. సుమారు లక్ష రూపాయలు మేరకు ఆస్థి నష్టం జరిగినట్లు తెలిపారు. జరిగిన నష్టాన్ని ప్రభుత్వానికి నివేదిస్తానని గిర్దావర్ శ్రీనివాస్ తెలిపారు. బాధిత కుటుంబానికి మండల కాంగ్రెస్ నాయకులు రూ.10 వేలు నగదు, 25కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్‌చైర్మన్ బుర్రరాములుగౌడ్, మాజీ చైర్మన్ ఒరుగల శ్రీనివాస్, నాయకులు సంధి మల్లారెడ్డి, సత్తిరెడ్డి, విజయభాస్కర్, బండారి శ్రీని వాస్, అనీల్, కడారి తిరుపతి, చెట్ల కిషన్, రవినాయక్, నవీన్ తదితరులు ఉన్నారు.

ప్రైవేట్ వైద్యులు వర్సెస్ డీఎంహెచ్‌వో

- ఆసుపత్రి ఉద్యోగిపై దౌర్జన్యం చేసిన డీఎంహెచ్‌వోపై కేసు
- విధులకు ఆటంకం కలిగించారని డీఎంహెచ్‌వో ఫిర్యాదు
- వైద్యులు, కాంగ్రెస్ నాయకుడిపై కేసు

కోల్‌సిటీ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రైవేట్ ఆసుపత్రి వైద్యులకు, డీఎంహెచ్‌వోకు మధ్య వివాదం ముదిరింది. ఆసుపత్రుల్లో తనిఖీల పేర డీఎంహెచ్‌వో వేధిస్తుందని, భారీగా అపరాధ రుసుము విధిస్తుందని కొన్ని రోజులుగా ప్రైవేట్ ఆసుపత్రుల వైద్యులు ఆరోపిస్తున్నారు. గోదావరిఖనిలో కొన్ని రోజుల క్రితం ప్రైవేట్ ఆసుపత్రులపై డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి జరిమానా విధించిన విషయంపై వైద్యులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. శనివారం గోదావరిఖని లక్ష్మీనగర్‌లోని మమత ఆసుపత్రిలో అన్‌రిజిష్టర్డ్ స్కానింగ్ యంత్రాన్ని వినియోగిస్తున్నారని ఫిర్యాదు వచ్చిందని డీఎంహెచ్‌వో అన్నాప్రసన్న తనిఖీలు జరిపారు. ఈ సందర్భంగా ఆమె చిప్పకుర్తి ఆనంద్ అనే వ్యక్తి కాలర్ పట్టుకుని లాక్కువెళ్లింది. ఒక గది తాళం పగులగొట్టడం, సిబ్బందిపై దౌర్జన్యానికి పాల్పడడం వివాదానికి కారణమైంది. డీఎంహెచ్‌వో ఆసుపత్రిలో దౌర్జన్యానికి పాల్పడుతుందంటూ వైద్యులు ఆరోపించారు. ఐఎంఏ అధ్యక్షుడు క్యాస శ్రీనివాస్, మాజీ మేయర్ అనీల్ కుమార్, మరికొందరు డాక్టర్లు, మాజీ కార్పొరేటర్లు మహంకాళి స్వామిలు ఆసుపత్రి వద్దకు వచ్చారు. ఈ సందర్భంగా వైద్యులకు, డీఎంహెచ్‌ఓకు సిబ్బందిపై దౌర్జన్యం చేసిన విషయమై వాగ్వాదం జరిగింది. అనంతరం స్కానింగ్ యంత్రాన్ని రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ఆనంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు డీఎంహెచ్‌ఓపై 296/బీ, 352, 351బీఎన్‌ఎస్ క్రింద కేసు నమోదైంది. ఈ ఘటన తరువాత డీఎంహెచ్‌ఓ అన్నాప్రసన్న శనివారం గోదావరిఖని వన్‌టౌన్‌పోలీస్ స్టేషన్‌లో ఆసుపత్రి నిర్వాహకుడు నాగిరెడ్డి, మాజీ మేయర్ బంగి అనీల్ కుమార్, ఐఎంఏ అధ్యక్షుడు క్యాస శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ మహంకాళి స్వామితో పాటు మరో 20మంది తన విధులకు ఆటంకం కలిగించారని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఈ నలుగురిపై బీఎన్‌ఎస్ 318/4, 132, 292, 351(2) రెడ్‌విత్ 3(5) బీఎన్‌ఎస్ కింద కేసు నమోదైంది. ఈ కౌంటర్ కేసులు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. వారం రోజుల క్రితం ఎన్‌టీపీసీలో జిల్లా వైద్యాధికారుల పేర కొందరు డబ్బులు వసూలు చేసిన ఘటనలు కూడా వివాదాన్ని రేపాయి. ప్రభుత్వ అధికారులు, వైద్యులు సమన్వయంతో పని చేసి ప్రజలకు సేవలు చేయాలి. ఈ వ్యవహారంలో ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దాల్సిన అవసరం ఉంది.

కగార్ హత్యాకాండలో ఆదివాసులే బాధితులు



మాట్లాడుతున్న పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీపతి రాజగోపాల్

పాలకుర్తి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోలో కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న కగార్ హత్యకాండాలో ఆదివాసులు, గిరిజనులే హతమవుతున్నారని పౌరహక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు శ్రీపతిరాజగోపాల్ ఆరోపించారు. నరేంద్రమోదీ కొనసాగిస్తున్న ఆపరేషన్ కగార్ హత్యాకాండాలో 470మంది మరణిస్తే అందులో 300 మంది అమాయక ఆదివాసీలేనని, మిగిలిన 170 మంది మావోయిస్టులున్నారని తెలిపారు. జయ్యారం గ్రామానికిచెందిన చీమల నర్సయ్య అలియాస్ జోగన్న ప్రథమ వర్ధంతి సభను కుటుంబ సభ్యులు ఆదివారం నిర్వహించారు. ఈసభకు హాజరైన రాజగోపాల్ మాట్లాడుతూ విలువైన ఖనిజసంపదను కార్పొరేట్ కంపెనీలకు అంటగట్టడానికి కుదుర్చుకున్న ఒప్పందం అమలు చేయడానికి అక్కడి ఆదివాసీలను తరలించడానికి, వారికి మద్దతుగా ఉన్న మావోయిస్టులను లేకుండా చేయడానికి కేంద్ర ప్రభుత్వం కగార్ ఆపరేషన్ చేపట్టిందన్నారు. మావోయిస్టులు ఇటీవల తాము శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు.

సీనియర్ పాత్రికేయులు సీపెల్లి రాజేశం అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభలో చీమల నర్సయ్య కుటుంబ సభ్యులు నంది రాజవ్వ, నారాయణ, సునీత, లక్ష్మినర్సయ్య, ముడి మడుగుల మల్లయ్య, బాలసాని రాజయ్య, మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్‌గౌడ్, పొన్నం రాజమల్లయ్య, గుమ్మడి కొమురయ్య, మార్వాడి సుధర్శన్, ఎరుకల రాజయ్య, వినోద్, బాపు, భీమన్న పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు రాలేదని మహిళ నిరసన

● పంచాయతీ కార్యాలయం వద్ద కుటుంబ సభ్యులతో వంటావార్పు



ఇందిరమ్మ ఇల్లు రాలేదని సామానుతో గ్రామపంచాయతీ వద్ద నిరసన తెలుపుతున్న తాడవేణి భవాని కుటుంబం

సైదాపూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇల్లు రాలేదని మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామానికిచెందిన ఓ మహిళ గ్రామపంచాయతీ భవనం వద్ద కుటుంబంతో కలిసి నిరసన తెలిపింది. బాధితురాలి కథనం ప్రకారం.. ఎక్లాస్‌పూర్ గ్రామానికిచెందిన తాడవేణి భవాని నిరుపేద మహిళ. ఇందిరమ్మ ఇల్లు రాకపోవడంతో తన కుటుంబంతో మూటముల్లె సర్దుకొని సామానుతో ఆదివారం గ్రామపంచాయతీ ఎదుట నిరసన తెలిపింది. మంచం, సామాను గ్రామపంచాయతీ వద్ద వేసుకొని, అక్కడే వంట చేసుకున్నారు. తమది నిరుపేద కుటుంబమని, ఇల్లు లేక కిరాయికి ఉంటున్నామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో తన పేరు రాకపోవడంతో తనబాధను ఈ విధంగా వ్యక్తం చేశానని తెలిపింది. ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడానికి నాకు ఎందుకు అర్హత లేదో తెలపాలని డిమాండ్ చేసింది. విషయం తెలుసుకున్న ఇందిరమ్మ కమిటీ సభ్యులు వెంటనే ఎక్లాస్‌పూర్‌కు చేరుకొని ఇంకా ఇందిరమ్మ ఇళ్ల లిస్ట్ ఫైనల్ కాలేదని లిస్టులో మీపేరు వచ్చేలా చూస్తామని భవా నికి నచ్చజెప్పారు. ఇల్లు వచ్చేలా చూస్తామని కమిటీ సభ్యులు చెప్పడంతో భవాని తన కుటంబంతో సామాను సర్దుకొని వెళ్లి పోయింది.

గాంధీనగర్ మిర్చికి ఘాటెక్కువ

● సుమారు 400 ఎకరాల్లో సాగు
● పలు ప్రాంతాల నుంచి వచ్చి కొనుగోలు
● ఈయేడు తగ్గిన ధర ● నష్టపోతామంటున్న రైతులు



పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కారం లేనిది ఏ వంటకం రుచి ఉండదు. పెద్దపల్లి పట్టణంలోని చందపల్లి, గాంధీనగర్‌కు మిర్చికి మంచి డిమాండ్ ఉంటుంది. గుంటూరు కారానికి దీటుగా ఇక్కడి మిర్చికి ఘాటు ఎక్కువగా ఉంటుంది. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి మిర్చి కొనుగోలు చేస్తారు. పెద్దపల్లి మున్సిపాల్టీ పరిధిలోని చందపల్లి, గాంధీనగర్‌లో సుమారు 4 వందలకు పైగా ఎకరాల్లో యేటా మిర్చి పంట పండిస్తారు. ఇక్కడ వివిధ రకాల విత్తనాలు తీసుకువచ్చి మళ్ళలో మిరప నారు పెంచుతారు. కొందరు వారికి సరిపడా మిరప నారు వేసుకోగా మరికొందరు నర్సరీలు ఏర్పాటు చేసి రూపాయికి ఒక్క మిరప మొక్కను విక్రయిస్తుంటారు. ఎకరాకు 30 నుంచి 35 క్వింటాళ్ళ మిరప దిగుబడి వస్తోంది. ఎకరానికి సుమారుగా లక్షన్నర రూపాయల వరకు ఖర్చు వస్తుంది. కౌలు ఖర్చులు, పంట సాగు ఖర్చులు, కూలీలకు పోను 7, 8 నెలల పాటు శ్రమిస్తే సుమారు రెండు నుంచి రెండున్నర లక్షల రూపాయలు మిగులుతాయి. వచ్చిన దిగుబడిని రోడ్డు వెంట విక్రయిస్తుంటారు. అలాగే చిరు వ్యాపారులకు ఇవ్వడం వల్ల గ్రామాల్లో తిరిగి అమ్ముకుంటున్నారు. అయినప్పటికి మిగిలిపోతే వరంగల్, గుంటూర్ జిల్లాలకు ఎగుమతి చేస్తారు.

ఈ ఏడు గడ్డు పరిస్థితి

ఈ ఏడు మిర్చి రైతులకు గడ్డు పరిస్థితి ఏర్పడింది. గతేడాది సుమారు 25 వేలకు క్వింటాల్ వరకు ధర పలకగా ఈయేడు 11 వేల నుంచి 12 వేలకు మించడం లేదు. అనుకున్న స్థాయిలో ధర రాకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు నల్లి పురుగు వ్యాపించి పంట దెబ్బతిన్నది. పురుగు సోకకుండా జాగ్రత్తలు తీసుకున్న వారికి అంతంతా మాత్రంగా పంట చేతికి వచ్చింది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో కూలీలు కూడా డిమాండ్ పెంచారు. గతేడాది మిర్చి ఏరితే అందులో నుంచి 2కిలోలు రైతు ఇచ్చేవారు. ఇప్పుడు ఆరు కేజీలు ఇస్తామన్నా కూలీలు రావడం లేదు.

ఎకరంన్నర సాగు చేశా..



- దొంతిరెడ్డి లక్ష్మీ

మాకున్న భూమిలో ఎకరంన్నర సాగు చేశాం. భార్యభర్తలం ఇద్దరం కష్ట పడితే 30 క్వింటాళ్ళ మిర్చి వచ్చింది. మొదటి విడుతలో మిర్చి నాణ్యత ఉన్నప్పటికి రెండో విడుతలో నాణ్యత లేదు. తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోంది.

ఎండలకు పని చేయలేకపోతున్నాం



- గాదె వెంకటరమణమ్మ

ఎండలకు పని చేయలేకపోతున్నాం. కొద్ది సేపటికే అలసి పోతున్నాం. పనులకు వెళ్ళాలంటే భయపడుతున్నాం. మిర్చి ఏరిన దానిలో రైతులు 6 కేజీలు ఇస్తే అవి ఎండి మూడు కేజీలు అవుతయి.

అధికారుల నిర్లక్ష్యంతో పెండింగ్‌లో అధ్యాపకుల సమస్యలు



సమావేశంలో మాట్లాడుతున్న టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి

గణేశ్‌నగర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉన్నా ప్రభుత్వం లోని కొందరు అధికారుల నిర్లక్ష్యంతో డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో తెలంగాణ ప్రభుత్వకళాశాలల గెజిటెడ్ అధ్యాపక సంఘం టీజీసీజీటీఏ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. అధ్యాపకుల సమస్యల పరిష్కారంలో టీజీసీజీటీఏ కృషి చేస్తునా కొందరు అధికారుల నిర్లక్ష్యంతో సమస్యలు పెండింగ్‌లో ఉంటున్నాయన్నారు. ఏడేళ్లుగా సంఘం చేపడుతున్న అనేకా కార్యక్రమాలు, అధ్యాపకుల కృషి ఫలితంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు ఘననీయంగా పెరిగాయన్నారు. ఇక ముందు కూడా కళాశాలల అభివృద్ధికి అధ్యాపకులు కృషి చేయాలని, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు పెంచాలని పిలుపునిచ్చారు. అనంతరం సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గోపి మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి సంఘం పనితీరు, వివిధదశల్లో ఎదుర్కొంటున్న సవాళ్లను వివరించారు. అధ్యక్షుడు డాక్టర్ బెల్లియాదయ్య, సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జె.చిన్న, ఆర్థిక కార్యదర్శి ఎన్.రమేశ్ గౌడ్, మహిళా కార్యదర్శి డాక్టర్ పావణి, రాష్ట్ర కార్యవర్గసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టులో భక్తుల రద్దీ


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మల్యాల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వారం తపు సెలవుదినంతోపాటు విద్యాసంస్థలకు సెలవులు రావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం ఆదివారం కోలాహలంగా మారింది. భక్తులు అంజన్నతో పాటు రాముల వారిని, బేతాలుడిని దర్శించుకున్నారు. వేసవి ఎండలతో ఉదయం సమయంలో భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకోగా ఆలయ అధికారులు భక్తులకు ఇబ్బందులు కలుగకుండా పర్యవేక్షించారు.

● అంజన్న సన్నిధిలో భద్రాచలం ఈవో

ఆదివారం భద్రాచలం రామాలయ ఈవో రమాదేవి కుటుంబసమేతంగా ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఈవో స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ తదితరులు వారి వెంట ఉన్నారు.

పేద ముస్లింలకు న్యాయం చేసేందుకే వక్ఫ్ చట్ట సవరణ

● సంస్కృతి పరిరక్షణే బీజేపీ ధ్యేయం ● ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పేదముస్లింలకు న్యాయం చేసేందుకే కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్ట సవరణ చేసిందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి అన్నారు. ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాన్ని ప్రతిపక్షాలు మానుకోవాలని ఆయన హితవు పలికారు. జగిత్యాలపట్టణంలోని బీఎల్ గార్డెన్ లో ఆదివారం జనజాగరణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వక్ఫ్‌చట్టం-2025పై అవగాహనకార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి, రాష్ట్రనాయకురాలు మౌనిక సుంకర, కిసాన్ మోర్చా జాతీయనాయకులు గోలి మధుసూధన్ రెడ్డి హాజరై మాట్లాడారు. మనసంస్కృతి పరిరక్షణే బీజేపీ ధ్యేయమని అన్నారు. వక్ఫ్ చట్టం కాంగ్రెస్ పార్టీ నిర్వాకం అని, వందల ఏళ్లయినా వక్ఫ్‌ఆస్తి తమకే చెందేలా చట్టం రూపొందించారన్నారు. బాబా సాహెబ్ ఆలోచనలకు అనుగుణంగా బీజేపీ పనిచేస్తుందని, ఆయనకు భారతరత్న ఇచ్చి గౌరవించిందన్నారు. కానీ అడుగడుగునా కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్‌ను అవమానించిందని ఆరోపించారు. రాజ్యాంగాన్ని పట్టుకుని తిరిగే హక్కు రాహుల్‌గాంధీకి లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు,ద్యులు నలువాల తిరుపతి, నరేంధర్‌రెడ్డి, కన్నం అంజయ్య, రాంబాబు, పడాల తిరుపతి, కేవీఎల్ఎన్ రెడ్డి, బీజేవైఎం రాష్ట్రనాయకులు దొనికెల నవీన్, ఓరుగంటి చంద్రశేఖర్, దివాకర్, సదాశివం, మమత, కవిత, పుష్పారెడ్డి, గణేష్‌తోపాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు శ్రీచైతన్య విద్యార్థి



విద్యార్థి రాంచరణ్‌రెడ్డిని అభినందింస్తున్న ముద్దసాని రమేష్ రెడ్డి

తిమ్మాపూర్, ఏప్రిల్ 27, (ఆంధ్రజ్యోతి): శ్రీచైతన్య డిఫెన్స్ అండ్ స్పోర్ట్స్ అకాడమికి చెందిన మానేటి రాంచరణ్ రెడ్డి జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రస్థాయిలోజరిగిన 68వఎస్‌జీఎఫ్ బాక్సింగ్‌విభాగంలో పాల్గొన్న రాంచరన్ రెడ్డి అత్యుత్తమ ప్రదర్శనద్వారా రాష్ట్రస్థాయిలో గోల్డ్‌మెడల్ సాధించి జాతీ యస్థాయికి ఎంపికయ్యాడని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థికి ఆయన నగదు పురస్కారం అందజేసి అభినందించారు.

రాష్ట్రస్థాయి టాలెంట్‌హంట్ హ్యాండ్‌బాల్ పోటీల చాంపియన్‌గా ఉమ్మడి జిల్లా


రాష్ట్రస్థాయి టాలెంట్‌హంట్ హ్యాండ్‌బాల్ పోటీల చాంపియన్‌గా నిలిచిన ఉమ్మడిజిల్లా జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఏజ్ టాలెంట్ హంట్ హ్యాండ్‌బాల్ బాలుర చాంపియన్‌షిప్‌ను కరీంనగర్ ఉమ్మడి జిల్లా జట్టు సొంతం చేసుకుంది. ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు హన్మకొండలో తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు సత్తా చాటిందని ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బసరవేని లక్ష్మణ్ తెలిపారు. ఈ సందర్భంగా జట్టును రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్, ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ సంఘ అధ్యక్షులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, కోచ్ వెంకటేశ్, సంఘం సంయుక్త కార్యదర్శి ప్రభాకర్ అభినందించారు.

అకాల వర్షం.. తడిసిన ధాన్యం

● అన్నదాతకు నష్టం


మెట్‌పల్లి ఏఎంసీ యార్డులో ధాన్యం కుప్పల మధ్య నిలిచిన వర్షపు నీటిని తొలగిస్తున్న రైతు


జూలపల్లి మండలం బాల్‌రాజ్‌పల్లి గ్రామశివారులో నేలవాలిన వరి పొలం

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 27 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మండలంలోని పలు గ్రామాలతోపాటు పట్టణంలో శనివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షంకురిసింది. దీంతో మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో విక్రయాలకు కోసం వరి కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. పలుగ్రామాల్లో నువ్వు పంటతోపాటు ఇతరపంటలు దెబ్బ తిని అన్నదాతకు నష్టంకలిగింది. పలు గ్రామాల్లో విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఏర్పడింది. తూకం వేసిన ధాన్యం సంచులు కూడా తడిసిపోయాయి. నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని బీజేపీ మండలాధ్యక్షుడు కొమ్ముల రాజు పాల్‌రెడ్డి, జనతాపార్టీ కిసాన్‌మోర్చా మండలాధ్యక్షుడు మారు జనార్థన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.

కోరుట్ల రూరల్ : కోరుట్ల మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రాత్రి ఈదురు గాలులతో వర్షం కురియడంతో మామిడి నేలరాలింది. కోరుట్ల మార్కెట్‌యార్డులో, కోరుట్లమండలం అయిలాపూర్‌లోని ధాన్యం కొనుగోలుకేంద్రంలో అకాలవర్షంతో ధాన్యం బస్తాలు తడిసిపోయాయి.

వెల్గటూర్: మండలంలో శనివారంరాత్రి ఈదురుగాలులకు మామిడికాయలు రాలడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. కొన్నిచోట్ల చెట్లు విరిగిపడడంతో విద్యుత్ సరఫరాకుఅంతరాయంఏర్పడింది. చెగ్యాంలో కొంతమేర వరిపంట నేలకొరిగింది.

గాలివానకు నేలవాలిన వరిపొలాలు

జూలపల్లి: మండలంలోనిఆయా గ్రామాల్లో శనివారం అర్థరాత్రి స్వల్పంగా కురిసిన అకాలవర్షం భారీఈదురుగాలులకు కోతకందిన వరిపంటలు నేల వాలడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోవడంతో ఆరబెట్టేందుకు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

శృంగేరికి వేములవాడ బృందం


శృంగేరిలో ప్రభుత్వవిప్ ఆదిశ్రీనివాస్ బృందం

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, దేవాదాయశాఖ ప్రిన్సిపల్‌సెక్రెటరీ శైలజరామయ్యర్, కమిషనర్ శ్రీధర్ శృంగేరి తరలివెళ్లారు. రాజన్నఆలయ పునరుద్ధర ణలో భాగంగా మార్పులు, చేర్పులు, భీమేశ్వరఆలయంలో భక్తులకు తాత్కలిక దర్శనంపై శృంగేరిపీఠాధిపతుల సూచనలు తీసుకునేందుకు తరలివెళ్లారు. శృంగేరి తరలివెళ్లిన వారిలో ఎండోమెంట్ సలహాదారు గోవిందాహరి, ఆర్‌అండ్‌బీ సీఈ రాజేశ్వర్‌రెడ్డి ఆలయఈవో వినోద్‌రెడ్డి, ఆర్కిటెక్ట్ సూర్యనారాయణ మూర్తి, అర్చకుడు శరత్ తదితరులున్నారు.

ఆరో రోజుకు కాంట్రాక్ట్, పార్ట్‌టైం అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమ్మె


ఒంటికాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్ట్, పార్ట్ టైం ప్రొఫెసర్లు

గణేశ్‌నగర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 12యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, పార్ట్‌టైం అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని శాతవాహన యూనివర్సిటీలో కాంట్రాక్ట్, పార్ట్ టైం అసిస్టెంట్ ప్రొఫెసర్లు చేస్తున్న సమ్మె ఆదివారానికి ఆరో రోజుకు చేరుకుంది. నిరవధిక సమ్మెలో భాగంగా అధ్యాపకులు ఒంటి కాలుపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. సమాజానికి విజ్ఞాన కేంద్రాలు యూనివర్సిటీలని, కాంట్రాక్ట్, పార్ట్‌టైం అసిస్టెంట్ ప్రొఫెసర్లను వెంటనే క్రమబద్ధీకరించాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, మేనిఫెస్టులో ఇచ్చినమాటను కాంగ్రెస్ నిలుపుకోవాలని గుర్తుచేశారు. సీఎం రేవంత్ రెడ్డి స్పందించాలని కోరారు.

కేంద్రమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలి

● ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్ పెరుమాళ్



తిమ్మాపూర్‌లో నిర్వహించిన పాదయాత్రలో పాల్గొన్న ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్ పెరుమాళ్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి

తిమ్మాపూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల ఘాతుక చర్యను అడ్డుకోవడంలో కేంద్రప్రభుత్వం విఫలమైందని, ఇందుకు బాధ్యత వహిస్తూ హోంశాఖ మంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని అఖిలభారత కాంగ్రెస్‌కమిటీ(ఏఐసీసీ) కార్యదర్శి విశ్వనాథన్ పెరుమళ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలకేంద్రంలో నిర్వహించిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్రలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉగ్రవాదులు ఇద్దరు విదేశీయులతో సహా 28మంది అమాయకులను పొట్టనబెట్టుకున్న సంఘటనకు ముమ్మాటికీ భద్రతా వైఫల్యమే కారణమని ఆరోపించారు. పార్లమెంటు సాక్షిగా అంబేద్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను సమాజం క్షమించదని అన్నారు. మానకొండూర్ నియోజకవర్గం అద్భుతంగా ఉందన్నారు.

ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ బీజేపీవల్ల పొంచిఉన్న ముప్పు నుంచి రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జ్ వెలిచాల రాజేందర్ రావు,నామిండ్ల శ్రీనివాస్, సుధగోని లక్ష్మి నారాయణ గౌడ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం..

వైద్యపరంగా పేదలను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఆదివారం క్యాంప్ కార్యాలయంలో తిమ్మాపూర్‌మండలానికి చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయన అందజేశారు. తిమ్మాపూర్ మండానికి 13వ విడతలో 48మందికి రూ.12,42,000 మంజూరైనట్లు తెలిపారు.

రాజ్యాంగాన్ని పరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉంది..

హుజూరాబాద్‌రూరల్: భారత రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఏఐసీసీ సెక్రెటరీ విశ్వనాథన్ అన్నారు. మండలంలోని జూపాక గ్రామంలో జై బాపు జై భీం జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర ఆదివారం జరిగింది.ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని కాపాడుకుంటే భవిష్యత్తు తరాలు బాగుపడుతాయన్నారు. అనంతరం గ్రామస్థులతోకలిసి రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జీ వొడితెల ప్రణవ్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడింట్ పద్మాకర్‌రెడ్డి, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు శ్రావన్‌నాయక్, తదితరులు ఉన్నారు.

పుస్తెల తాడు అపహరణ

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఇంటిఆవరణలో నిద్రిస్తున్న మహిళమెడలో నుంచి పుస్తెల తాడు చోరీకిగురైంది. స్థానికరాజీవ్‌నగర్‌తండాకు చెందిన ఇస్లావత్ బుల్లి కుటుంబసభ్యులు ఇంటి ఆరుబయట నిద్రపోయారు. ఆదివారం ఉదయం నిద్రలేచి చూసేసరికి మెడలో పుస్తెల తాడు కనిపించలేదు. ఇంటి పరిసరాల్లో వెతికినా దొరకకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు చోరీచేసినట్టు భావించి పోలీసులకు ఫిర్యాదుచేశారు.ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌లో చెల్పూర్‌వాసి ప్రతిభ


రఘును సన్మానిస్తున్న స్నేహితులు

హుజూరాబాద్ రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన వంతడుపుల రఘు ఇటీవల హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో జరిగిన జాతీయస్థాయి అథ్లెటిక్స్‌పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభను కనబర్చాడు. ఈమేరకు ఆదివారం ఆయన స్నేహితులు సత్కారించారు. కార్యక్రమంలో సామల ప్రతాప్‌రెడ్డి, కోడిగూటి ప్రవీన్, గుడిపాటి జయపాల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

పెగడపల్లి ఎస్‌ఐ సస్పెన్షన్?

పెగడపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి ఎస్‌ఐ సీ.హెచ్.రవికిరణ్ సస్పెన్షన్‌కు గురైనట్లు తెలిసింది. సస్పెన్షన్ ఉత్తర్వులు ఆదివారం రాత్రి వెలువడినట్లు సమాచారం. సబ్సిడీ ట్రాక్టర్ల పేరుతో రైతులను మోసగించిన కేసులో నిందితుల అరెస్టు, రిమాండ్, బెయిల్ విషయంలో ఎస్‌ఐ రవికిరణ్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ఉన్నతాధికారులు ఎస్‌ఐపై సస్పెన్షన్ వేటు వేసినట్లు తెలుస్తోంది.

నేడు ప్రజావాణి రద్దు

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించ నున్న ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. ప్రజావాణి వినతులు ఇవ్వడానికి ప్రజలు రావద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు భూభారతి అవగాహన సదస్సులు అన్ని మండలాలలో నిర్వమిస్తున్నందున ప్రజావాణి రద్దు చేయడం జరిగిందని పేర్కొన్నారు.

సామూహిక శ్రీ రుద్ర పారాయణం

ధర్మపురి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణంలో సామూహిక శ్రీ రుద్ర పారాయణం ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీశ్రీశ్రీ మాధవా నంద స్వామి సంకల్పం మేరకు శ్రీ రుద్ర, శ్రీ సూక్త కోటి పారాయణ గూపు ప్రారంభించి 143 రోజులు పూర్తి చేశారు. పారా యణ దారులు కలిసి 5823 పారాయణాలతో నాలుగవ మహా రుద్రాలు పూర్తి చేశారు. ఐదవ మహారుద్రం సంఖ్య పూర్తి చేయడానికి లోక కళ్యాణం కోసం వేద బ్రాహ్మణులు ఆదివారం నుండి సామూహిక రుద్ర పారాయణం, శ్రీ సూక్త పారాయణం చేయాలని సంకల్పించారు. అనేక మంది ప్రజలు, భక్తులు పాల్గొని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ధర్మకర్త రాపర్తి సాయికుమార్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

కొడిమ్యాల, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల మైదానంలో గత మూడు రోజులుగా కొడిమ్యాల క్రికెట్ క్లబ్ ఆద్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ బాయ్స్ టెన్నీస్‌బాల్ పోటీలు ఆదివారం ముగిసాయి. విజేతలైన కొడిమ్యాలలోని జియో టీంకు మొదటి బహుమతిగా 3వేల రూపాయలను జిల్లా ఎన్‌ఎస్‌యుఐ నాయకుడు ముత్యం శంకర్ సమకూర్చారు. రెండవ బహుమతి 2వేల రూపాయలను నాచుపల్లి టీంకు కొడిమ్యాల క్రికెట్ క్లబ్ వారు సమ కూర్చారు. విజేతలకు నిర్వహకులు బహు మతులను అందించారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు గుర్రం నర్సయ్య, లక్ష్మణాచారి, కృష్ణంరాజు, నిర్వహకులు మొహనాచారి ఉన్నారు.

బీఆర్‌ఎస్ జెండా ఆవిష్కరణలు


ధర్మపురిలో మాట్లాడుతున్న డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి


పెగడపల్లిలో బీఆర్‌ఎస్ జెండా ఆవిష్కరణ

మెట్‌పల్లిటౌన్, ఏప్రిల్27 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం ఆవరణలో బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షులు బోయిన్‌పల్లి చంద్రశేఖర్‌రావు పార్టీ జెండాను ఆవిష్కరించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ఆధ్వర్యంలో వేడుకలను జరిపారు. అనంతరం పార్టీ నాయకులు వరంగల్లో జరగనున్న రజతోత్సవ సభకు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

●**ధర్మపురి:** ధర్మపురి పట్టణంలో బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షులు ఆకుల రాజేష్ తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాల వేసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన బీఆర్‌ఎస్ పది ఏళ్ల కాలంలో అధికారంలో ఉండి అనేక ప్రజా సంక్షేమ పథకాలు చేపట్టినట్లు తెలిపారు. మోసపూరిత వాగ్దానాలతో గద్దె నెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం చేతగాక అన్ని రంగాలను కుదేలు చేస్తుందని ఆయన విమర్శించారు. తెలంగాణ ప్రజానీకానికి శనిలా పట్టుకున్న కాంగ్రెస్ పీడ విరగడయి మరో మూడేళ్లలో కేసీఆర్ నాయకత్వంలో స్వర్ణయుగం రాబోతుందని ఆయన తెలిపారు. కేసీఆర్ ఒక గొప్ప నాయకుడని, బీఆర్‌ఎస్ పార్టీ 25వ రజతోత్సవం కోసం యావత్ తెలంగాణ సమాజం ఉత్కంఠగా ఎదురు చూసిందని ఆయన అన్నారు. కేసీఆర్‌ను తెలంగాణ జాతిపితగా ఆయన అభివర్ణించారు. ఈ రజతోత్సవం కోసం ఎల్కతుర్తికి నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 5 వేల మంది వరకు తరలి వెళ్లారని ఆయన అన్నారు. వారి కోసం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ నేతృత్వంలో గ్రామ గ్రామాన బస్సులు, కార్లు, ఆటోలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. చివరగా ఎల్కతుర్తి రజతోత్సవ సభ కోసం తరలి వెళుతున్న బీఆర్‌ఎస్ నాయకుల వాహనాలనను జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరు రాజేష్‌కుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ సంగి సత్యమ్మ, మాజీ వైస్‌చైర్మన్ ఇందారపు రామయ్య, మాజీ కౌన్సిలర్లు బండారి అశోక్, అయ్యోరు వేణుగోపాల్, తరాల్ల కార్తీక్, సయ్యద్ యూనస్, స్తంభండాకడి మహేష్, చిలువేరి శ్యాంసుందర్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షులు ఆకుల రాజేష్, నాయకులు సంగి శేఖర్, చుక్క రవి, సయ్యద్ ఆసిఫ్, పెరుమాండ్ల ఎల్లాగౌడ్, నక్క రాజేందర్, కల్లెం రాజరెడ్డి, బండారి రంజిత్ తదితరులు పాల్గొన్నారు.


వెల్గటూర్‌లో బీఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న మండల అధ్యక్షుడు రాంచంద్రం గౌడ్

●**రాయికల్:** రాయికల్ పట్టణంలో ఆదివారం పట్టణ బీఆర్‌ఎస్ శాఖ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రతి వార్డులో పార్టీ జెండాలను ఎగురవేశారు. అనంతరం వరంగల్ సభకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఎలిగేటి అనిల్ కుమార్, మాజీ ఏఎంసీ చైర్మన్‌లు మారంపెల్లి రాణి, ఎనుగందుల ఉదయశ్రీ, కో ఆర్డినేటర్ తురగ శ్రీధర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు మారంపెల్లి సాయి కుమార్, వల్లకొండ మహేష్ గౌడ్, శ్రీరాముల సువర్ణసత్యనారాయణ, మాజీ కో ఆప్షన్ సభ్యులు సోహైల్, పెండెల వనితగణేష్, వార్డు ఇన్‌చార్జిలు ఎనుగందుల లింగం గౌడ్, ఇంతియాజ్, మోసిన్ బాబా, ప్రసాద్, రాంచంద్రం, వినోద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

●**కొడిమ్యాల:** మండలంలోని హిమ్మతురావుపేట గ్రామంలో ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకలను బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు జెండాను ఆవిష్కరించి ఘనంగా జరుపుకున్నారు. అనంతరం వరంగల్‌లో జరుగుతున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమాల్లో మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పులి వెంకటేష్‌గౌడ్, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు కృష్ణారావు, మాజీ జడ్పీటీసీ ప్రశాంతి, తిర్మాలాపూర్ సింగిల్ విండో చైర్మన్ రాజేందర్, నాయకులు కొత్తూరి స్వామి మల్లయ్య, గంగసాగర్, రాజు, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

●**వెల్గటూర్:** మండలంలోని అన్ని గ్రామాల్లో బీఆర్‌ఎస్ ఆవిర్భావ వేడుకలను బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వెల్గటూర్‌లో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాంచంద్రంగౌడ్ బీఆర్‌ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ జాతిపిత కేసీఆర్ అని అన్నారు. రాష్ట్ర బీఆర్‌ఎస్ కమిటీ పిలుపు మేరకు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకు బీఆర్‌ఎస్ ఆవిర్భావ వేడుకలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంధ్ర నర్సింగారావు, కనపర్తి సుధాకర్‌రావు, జగదీశ్వర్, రాజేష్, మహేష్, గోపి, విరణ్, నర్సయ్య, అజిత్, సతీష్, అశోక్, సత్యం పాల్గొన్నారు.


మెట్‌పల్లిలో పార్టీ జెండాను ఎగురవేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


రాయికల్‌లో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నీటి బొట్టు.. ఒడిసి పట్టు

(5వ పేజీ తరువాయి)

రానున్న వర్షాకాలంలో ప్రతీ నీటిబొట్టును పొదుపు చేసుకునే అవకాశాలు ఉంటాయని నిపుణులు పేర్కొంటున్నారు.

● **కొరవడిన భాగస్వామ్యం..**

వానాకాలంలో అన్ని చోట్లా వర్షపు నీరు ప్రధాన రహదారులు, ఇళ్లలోకి చేరి కునుకు లేకుండా చేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో విరివిగా ఇంకుడు గుంతలను తవ్విస్తే ఎద్దడి సమస్యను అధిగమించడంతో పాటు భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా ఉంటుంది. ఒకటిన్నర మీటర్ల లోతు, రెండున్నర మీటర్ల వెడల్పు, లేదా రెండు మీటర్ల లోతు, మూడు మీటర్ల వెడల్పు ఉండేలా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందుకోసం వార్డుల వారీగా కమిటీలు కూడా పూర్తి చేయాలని గతంలో సూచించినా అడుగు ముందుకు పడలేదు. ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ తదితర శాఖలకు సంబంధించిన అధికారులు స్థలాల ఎంపికను చేపట్టాల్సి ఉన్నా దృష్టి సారించడం లేదు. ఇంకుడుగుంతల వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించడంపై అధికార యంత్రాంగం దృష్టి సారించాల్సి ఉంది. పాత గృహాల్లోనూ, కొత్త ఇళ్ల నిర్మాణాల్లోనూ తవ్వించడంపై దృష్టి సారించి ఆ దిశగా ప్రజలల్లో మార్పు తీసుకొని వస్తేనే భవిష్యత్తులో నీటి సమస్యలు ఎదుర్కొనే వీలు కలుగుతుంది.

మంత్రికి బసవేశ్వర జయంతి ఆహ్వాన పత్రిక అందజేత

జగిత్యాల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రవీంద్ర భారతిలో ఈనెల 30వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే బసవేశ్వర జయంతి కార్యక్రమాన్ని రావాల్సిందిగా రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ఉత్సవ కమిటీ నాయకులు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఆదివాంర హైదరాబాద్‌లో బసవేశ్వరా ఉత్సవ కమిటీ చైర్మన్, ఎంపీ సురేశ్ శెట్కార్‌తో పాటు జగిత్యాలకు చెందిన ఉత్సవ కమిటీ సభ్యులు గుంటి జగదీశ్వర్‌లు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఇందుకు మంత్రి దామోదర రాజనర్సింహ సానుకూలంగా స్పందించినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు జగదీశ్వర్ తెలిపారు.

'మల్లారెడ్డి ఆశయ సాధనకు కృషి'


మల్లారెడ్డి విగ్రహనికి నివాళర్పిస్తున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

సారంగాపూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కొండ్ర మల్లారెడ్డి ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. ప్రజా జీవితంలో స్వర్గీయ కొండ్ర మల్లారెడ్డి ఆదర్శ మూర్తి అని ఆయన అన్నారు. కొండ్ర మల్లారెడ్డి 15వ వర్ధంతి కార్యక్రమాన్ని మండల కేంద్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి హాజరై మల్లారెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం జీవన్‌రెడ్డి మాట్లాడుతూ మల్లారెడ్డి అందరివాడని కొనియాడారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం పని చేసి ప్రజా వ్యక్తిగా గుర్తింపు పొందిన గొప్ప నాయకుడన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సమకారంతో ఇచ్చిన మాట ప్రకారం సారంగాపూర్ మండలాన్ని మల్లారెడ్డి మండలంగా నామకరణం చేయుటకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మసర్తి రమేష్, గుర్రాల రాజేందర్‌రెడ్డి, బూక్య సరళ, పోల్సాని నవిన్ రావు, మానాల లక్ష్మణ్, ఆకుల రాజిరెడ్డి, పూర్ణ చందర్‌రెడ్డి, కొండ్ర రాంచందర్‌రెడ్డి, సుభాష్, ప్రసాద్ గౌడ్, లక్ష్మారెడ్డి, హరీష్, మహేష్, శేఖర్, మల్లారెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

తిరునక్షత్ర జయంతి వేడుకలు

మెట్‌పల్లిటౌన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి స్వర్ణకార సంఘంలో తిరునక్షత్ర జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పీఠాధిపతి కుమారం సీతారామ శాస్త్రి ముఖ్య అతిథిగా విచ్చేయగా వారిని సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రభుత్వ అసుపత్రిల రోగులకు పండ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వడగనంబి పీఠం అధ్యకులు ఇల్లందుల కృష్ణమాచారి, శ్రీపాద రంగయ్య, గన్నారం నరసింహాచారి, గన్నారం బట్టల నరసింహచారి, ఇల్లెందుల రమేష్, మనుమయ సంఘ అధ్యక్షుడు మురళి, ఈశ్వర్, నాంపల్లి మారుతి, నిర్మల్ శ్రీనివాస్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు తరలిన శ్రేణులు

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల అర్బన్, రూరల్ మండలాల్లోని పలుగ్రామాల్లో ఆదివారం బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించి అనంతరం ఎల్కతుర్తి రజతోత్సవ సభకు తరలివెళ్లారు. జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి, జగిత్యాల మండలం తిప్పన్నపేట, మోతె, గోపాల్‌రావుపేట, మండలంలోని తదితర గ్రామాలనుండి భారీగా వాహనాల్లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివెళ్లారు.

●కోరుట్ల/ కోరుట్ల రూరల్: కోరుట్ల మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులతో పాటు మండలంలోని గ్రామాల నుండి బీఆర్‌ఎస్ శ్రేణులు వరంగల్ మహా సభకు బయలు దేరి వెల్లారు. వాహన శ్రేణిని పట్టణంలోని సాయిబాబ దేవాలయం వద్ద సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, ఎఖిన్‌పూర్ సింగిల్ విండో చైర్మెన్ నర్సరెడ్డి, రైతు సమన్వయ కమిటి జిల్లా మాజీ అధ్యక్షుడు చీటి వెంకటరావు ప్రారంభించారు.

●మెట్‌పల్లి రూరల్: మండలంలోని ఆయా గ్రామాల నుంచి మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి ఆధ్వర్యంలో గులాబీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు.

●రాయికల్: రాయికల్ పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల నుంచి బీఆర్‌ఎస్ నాయకులు తరలివెళ్లారు.

●పెగడపల్లి : బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు పెగడపల్లి మండలం నుండి ఆ పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు లోక మల్లారెడ్డి, నాయకులు మాదారపు కరుణాకర్ రావు, ఉప్పుగండ్ల నరేందర్ రెడ్డి, రాజశేఖర్ గౌడ్,రాజేశ్వర్ రావు, స్వామి ఉన్నారు.

●బీర్‌పూర్: బీర్‌పూర్ మండలంలోని ఆయా గ్రామాల నుండి బీఆర్‌ఎస్ శ్రేణులు భారీ సంఖ్యలో తరలి వెల్లారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు కొల్ముల రమణ, మండల పార్టీ అధ్యక్షులు నేరెల్ల సుమన్, ఆయా గ్రామాల గ్రామాశాఖల అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు వెల్లారు.

●మల్యాల: వరంగల్ సభకు మండలం నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులు తరలివెళ్లారు. కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జనగాం శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు కొండపల్కుల రామ్మోహన్‌రావు, విండో చైర్మన్లు సాగర్‌రావు, మధుసూధన్‌రావు ఉన్నారు.

●వెల్గటూర్: మండలం లోని వివిధ గ్రామాల నుండి బీఆర్‌ఎస్ శ్రేణులు ఆదివారం తరలి వెళ్లారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాంచంద్రం గౌడ్, ప్రధాన కార్యదర్శి జూపాక కుమమార్, మండల యూత్ అధ్యక్షుడు బిడారి తిరుపతి, కుశనపల్లి రవి, తిరుమల్‌చారి, మూగల సత్యం, విద్యాసాగర్, కొప్పుల సురేష్ పాల్గొన్నారు.

●కథలాపూర్: మండలంలోని పలు గ్రామాల నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ జడ్పీటీసీ, మాజీ వైస్ ఎంపీపీలు ఉన్నారు.

ధాన్యం తరుగుపై రైతు ఆందోళన

మల్యాల, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వాపూర్‌లో గల వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో తూకం వేసిన ధాన్యం తరలిపోయిన తరువాత నిర్వహకులు తగ్గుదల చేస్తున్నారంటూ సర్వాపూర్‌కు చెందిన కానుగంటి మల్లేశం అనే రైతు ఆవేధన వ్యక్తం చేశాడు. గురువారం ధాన్యం తూకం వేశాక 174.40 క్వింటాళ్ల ధాన్యం 436 సంచులలో తరలించినట్లు నిర్వహకులు తనకు చీటీ రాసిచ్చారని అందుకు గాను తాను రూ.ఏడు వేల హమాలీ చార్జీలు చెల్లించడం జరిగిందని తెలిపాడు. అయితే ఇప్పుడు తన 436 సంచుల ధాన్యంను 421 సంచులుగా చెబుతున్నారని దీంతో సుమారు ఆరు క్వింటాళ్ల వరకు ధాన్యం నష్టపోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. నిర్వహకులు తనకు న్యాయం చేయాలని కోరాడు. ఈ విషయమై మల్యాల సింగిల్ విండో సీఈవో శ్రీనివాస్‌ను సంప్రదించగా పలుమార్లు సంచులను లెక్కించగా వేర్వేరుగా వచ్చాయని అన్నారు. తమ సిబ్బంది అక్కడ లేకపోవడంతో ఇతరులు చీటీ రాసిచ్చారని అయినప్పటికీ తరలించిన ధాన్యం వివరాలు మరో సారి పరిశీలిస్తామని తెలిపారు.

ఉగ్రదాడి అమరులకు కొవ్వొత్తుల నివాళి

కోరుట్ల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఉగ్రదాడిని నిరసిస్తూ పట్టణంలో పలు పార్టీల నేతలు కొవ్వత్తుల నివాళిని అర్పించారు. పట్టణంలోని టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి ఆధ్వర్యంలో అమరులకు ఘన నివాళిని అర్పించారు. అమరులకు కొవ్వత్తుల నివాళిని అర్పించి ప్రగాడ సంతాపం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొక్కుల మహదేవ్, గంగుల రాజేష్, శేఖర్, నరహరి, మల్లేశ్వరి, కళ్యాణి, దివ్య, సోని, శాంత, శైలజ, పద్మ, రాణిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

●పట్టణంలోని పోతని భూమయ్య కళ్యాణ భవనంలో నిర్వహించిన పూర్వ విద్యార్థుల ఆపూర్వ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు ఉగ్రదాడిలో మృతి చెందిన అమరులకు నివాళ్లను అర్పించారు. ఈ సందర్భంగా వారి ఆత్మశాంతి చేకూరాలని కొరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళ్లను అర్పించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

●మల్లాపూర్, ఏప్రిల్, 27 (ఆంధ్రజ్యోతి): జమ్ము కాశ్మీర్‌లోని పహల్గాంన్‌లో జరిగిన ఉగ్రదాడిని మండలంలోని రేగుంట గ్రామం లోని విశ్వబ్రాహ్మణులు తీవ్రంగా ఖండించారు. ఆదివారం ఉగ్రవాద దాడిలో మృతి చెందిన వారి ఆత్మశాంతి చేకురలని నాయకులు, యవకులు నివాళులర్పించారు. గ్రామంలోని సంఘభవనంలో మృతుల ఆత్మ శాంతి చేకురలని నివాళులర్పించి దాడిని ఖండిస్తూ నిరసన నినదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పహల్గాంలో టూరిస్టులపై ఉగ్రవాదులు చేసిన కిరాతక దాడి ఘటన దేశ సమైకృతను దెబ్బతీసే కుట్రలో దారుణ చర్యకు పాల్పడడం అత్యంత బాధాకరమన్నారు.

దేశంలోని ప్రతి ఒక్కరు కేంద్ర ప్రభుత్వానికి అన్ని విధాలుగా అండగా నిలవాలన్నారు. మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటిస్తూ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.


కోరుట్లలో అమరులకు నివాళి

శ్రీరామకృష్ణ సంకీర్తన మండలి వ్యవస్థాపకుడు మృతి

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేంపేట గ్రామంలో దశాబ్దాల కాలం క్రితం ఏర్పాటు చేసిన శ్రీ రామకృష్ణ సంకీర్తన మండలి వ్యవస్థాపకుడు గాజంగి బాలయ్య ఆదివారం మృతి చెందాడు. ఆయన మృతి పట్ల పలువురు నాయకులు, ప్రజలు తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ జపాన్ కరాటే బ్రౌన్ బెల్ట్‌కు ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి చెందిన విద్యార్థులు ముగ్గురు ఎంపికైనట్లు కరాటే శిక్షకులు ప్రవీణ్ తెలిపారు. ఆదివారం జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా కరీంనగర్ జిల్లా ప్రధాన కరాటే శిక్షకులు బొల్లి ఐలయ్య ఆధ్వర్యంలో కరీంనగర్ లో నిర్వహించినా బెల్ట్ పరీక్షలో ఇబ్రహీంపట్నంకు చెందిన వి.హరిప్రీత్, ఎ.హృషికేష్, జె.హర్షవర్ధన్ ఉత్తీర్ణత సాధించినట్లు పెర్కోన్నారు. ఉత్తీర్ణత సాధించిన కరాటే విద్యార్థులు తెలంగాణ రాష్ట్ర ప్రధాన శిక్షకులు, ప్రధాన పరీక్షా నిర్వహకులు రాపోలు సుదర్శన్ మాస్టర్ ప్రశంసా పత్రాలు, బెల్టులు, పథకాలను అందజేశారు. పథకాలు సాధించిన విద్యార్థులను కరాటే శిక్షకులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

ఐసీడీఎస్‌లో అక్రమాలపై చర్యలు

మెట్‌పెల్లి టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మెట్‌పల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టులో 2012వ సంవత్సరంలో జరిగిన అక్రమాలకు ఎట్టకేలకు పుష్కర కాలం తర్వాత అధికారులు చర్యలు చేపట్టారు. 2012-13 ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పీడీ కార్యాలయం ద్వారా కోటిన్నర రూపాయల అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వచ్చాయి. అప్పట్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు ప్రభుత్వం కేటాయించిన నిధుల్లో ఆరు కోట్ల రూపాయల నిధులు మిగిలాయి. అయితే మిగిలిన నిధులను వెనక్కి పంపాల్సి ఉండగా ఉమ్మడి జిల్లాలోని 11 ఐసీడీఎస్ ప్రాజెక్టులకు సరుకుల పేరిట కోటిన్నర రూపాయల ముందస్తు బిల్లులు ట్రెజరీకి పంపించారు. కాగా అప్పుడున్న పరిస్థితితుల కారణంగా ఆ బిల్లులు ట్రెజరీ నుంచి పాస్ కాలేదు. 2013లో అంగన్‌వాడీల్లో పిల్లలకు ఇచ్చే మెనూ మారడంతో దాని ప్రకారం సరుకులు అంగన్‌వాడీలకు సరఫరా అయ్యాయి. అయితే అప్పటి వరకు ట్రెజరీలో పెండింగ్‌లో ఉన్న బిల్లులు పాస్ కావడంతో అప్పటి అధికారులు అవినీతికి తెగబడ్డారు. కొన్ని రోజుల తర్వాత ఈ అవినీతి బయట పడడంతో అధికారులు విచారణ చేపట్టారు. అయితే ఎట్టకేలకు అవినీతి జరిగిన పుష్కర కాలానికి బాధ్యులపై అధికారులు చర్యలకు ఉపక్రమించారు. ఆలస్యంగానైనా అధికారులు 83 లక్షల రూపాయల రికవరీకి ఆదేశాలు జారీ చేశారు. అయితే అవినీతికి పాల్పడ్డ వారిలో దాదాపు అందరూ రిటైర్ కాగా వారి పెన్షన్‌లో కోత విధించారు. అవినీతి జరిగినప్పుడు మెట్‌పల్లి సీడీపీవోగా పనిచేసిన మమత ప్రస్తుతం జగిత్యాల సీడీపీవోగా ఎఫ్‌ఏసీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈమెకు రెండు సంవత్స రాల ఇంక్రిమెంట్లు నిలిపివేయాలని ఇటీవల అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

అర్హులున్నా మళ్లీ ఆమెకే అందలం

మెట్‌పల్లి సీడీపీవోగా మమత బాధ్యతలు నిర్వర్తిస్తున్న తరుణంలో ఆమెపై వచ్చిన అవినీతి ఆరోపణల నేపథ్యంలో సీడీపీవోగా ఎఫ్‌ఏసీ బాధ్యతల నుంచి తొలగించారు. అప్పటి నుంచి ఆమె సూపర్‌వైజర్‌గా కొనసాగుతున్నారు. అయితే గత సంవత్సరం బదిలీల్లో భాగంగా మల్యాల ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌లో సూపర్‌వైజర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న మమత జగిత్యాలకు బదిలీ కావడంతో సీడీపీవోగా మళ్లీ ఆమెకు బాధ్యతలు అప్పగించారు. అయితే జగిత్యాల ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌లో ఆమె కన్నా అర్హత ఉన్న సూపర్‌వైజర్లు ఉన్నప్పటికీ మమతకు అధికారం కట్టబెట్టడంపై అనేక విమర్శలు వచ్చాయి. అక్రమాలకు పాల్పడ్డట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి ఉన్నతాధికారి బాధ్యతలు అప్పగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నియామకం

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): భారతీయ జాతీయ డాక్ కర్మచారి సంఘ్ కన్వీనర్‌గా బోగ సత్తన్నను ఎన్నుకున్నారు. ఆదివారం జగిత్యాల ఆర్యవైశ్య భవన్ లో జరిగిన భారతీయ మజ్దూర్ సంఘ్ అనుబంధ భారతీయ గ్రామీణ డాక్ కర్మచారిసంఘ్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో భరతీయ పోసల్ ఎంప్లాయిస్ యూనియన్ కరీంనగర్ అధ్యక్షులు దాడి మల్లేశం సకినాల అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన

కథలాపూర్, ఏప్రిల్27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మాస్ట్రో కిడ్స్ ప్లే స్కూల్లో ఆదివారం రిథమ్స్ 2025 పేరిట నిర్వహించిన వీడ్కోలు హంగామా పార్టీ సందడిగా జరిగింది. చిన్నారులు వివిధ రకాల పాటలపై ప్రదర్శించిన నృత్యాలు అద్భుతం ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై నవీన్ మాట్లాడుతూ చిన్నారులకు ఆటా, పాటలతో కూడిన విద్య వల్ల మానసిక శక్తి పెరిగి చదువు పట్ల ఆసక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. పలు పోటీల్లో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు ప్రశంసా పత్రాలతో పాటు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఆకుల రాజేశ్, ప్రిన్సిపాల్ ఆకుల రంజిత్, డైరెక్టర్ ఆకుల రాజేందర్, చిన్నారుల తల్లిదండ్రులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం

రాయికల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టంపేట గ్రామంలో జగిత్యాలలోని శ్రీ వేంకటేశ్వర ఆర్థో, జనరల్ హస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామ పంచాయతీ వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ రెడ్డి సుమారు 100 మంది రోగులను పరీక్షించి ఆరోగ్య సూచనలు, సలహాలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జాన స్వరూపగోపి, మాజీ సర్పంచులు తంగెళ్ల రమేష్, సిరిపురపు భారతిసత్తయ్య, గ్రామ వైద్యులు ఎలిగేటి గంగాధర్, బోగ నరేష్, ఆడెపు మధు, అశోక్, ఎర్రన్న, గంగారాం, భూమయ్య, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.